# రెండోరోజూ దరఖాస్తుల వెల్లువ

**● వలుచోట్ల ప్రజా పాలన కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ గౌతమ్ ● సుమారు 43,081 మంది దరఖాస్తు**

మేడ్చల్ జోన్ బృందం, డిసెంబరు 29 : మేడ్చల్ నియోజకవర్గంలో ప్రజా పరిపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం కొనసాగింది. రెండో రోజూ దరఖాస్తులు వెల్లువెత్తాయి. ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అధికారులకు దరఖాస్తులు సమర్పించారు. కాగా ప్రతి మండలంలో రెండు గ్రామాల్లో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించగా, మున్సిపాలిటీల్లో అన్ని వార్డుల్లో ప్రజల దరఖాస్తులను స్వీకరించారు.

నియోజకవర్గంలోని ఐదు మండలాలు, 7 మున్సిపాలిటీలు, 3 కార్పొరేషన్లలో కలిపి మొత్తం 43,081 దరఖాస్తులు వచ్చాయి. మేడ్చల్ పట్టణంలోని 7, 23 వార్డుల్లో, మండలంలోని గౌడవెల్లి గ్రామంలో ప్రజా పాలన దరఖాస్తుల కేంద్రాలను జిల్లా కలెక్టర్ గౌతమ్, అడిషనల్ కలెక్టర్ అగస్త్యతో కలిసి సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో అర్హులందరికీ ఆరు గ్యారంటీలను అందించేందుకు చర్యలు చేపట్టామన్నారు. రీసోర్స్ పర్సన్‌లు, సిబ్బంది అందజేసిన దరఖాస్తులను ప్రజలంతా పూరించి, కౌంటర్లలో అందజేయాలన్నారు. అయితే దరఖాస్తులకు ప్రజలు ఆధార్, రేషన్ కార్డులు జత చేస్తున్నారా? లేదా? అని కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైన సూచనలు ఇవ్వాలని, ప్రజలకు ఇబ్బంది కల్గకుండా చూడాలని అధికారులకు సూచించారు. అవసరమైతే మరో కౌంటర్ ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకోవాలని సూచించారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈఓ దేవసహాయం, డీపీఓ రమణమూర్తి, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

బోడుప్పల్ పరిధిలోని 33 కేంద్రాల్లో ఆరు గ్యారంటీల పథకాల దరఖాస్తులను స్వీకరించారు. మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి, పూడూర్ గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమాన్ని ఎంపీడీవో పద్మావతి, తాసీల్దార్ శైలజ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాబు యాదవ్, సురేందర్ ముదిరాజ్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, ఏవో అర్చన, డీటీ దిలీప్ పాల్గొన్నారు. అదే విదంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ రాములు పర్యవేక్షణలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించారు. జవహర్‌నగర్‌లో మేయర్ మేకల కావ్య, కమిషనర్ రామలింగం ప్రజా పాలన కేంద్రాలను పరిశీలించారు. 6వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమాన్ని కార్పొరేటర్ పల్లవు రవి పర్యవేక్షించారు. కీసర మండలం గోధుమకుంట, అంకిరెడ్డిపల్లి గ్రామాల్లో గ్రామసభలను నిర్వహించారు. మూడుచింతలపల్లి మండలం జగ్గంగూడ గ్రామంలో నిర్వహిస్తున్న దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని జడ్పీ చైర్మన్ పరిశీలించారు. శామీర్‌పేట మండలం మురహర్‌పల్లిలో తాసీల్దార్ సత్యనారాయణ ఆధ్వర్యంలో, బాబాగూడలో ఎంపీడీవో వాణి ఆధ్వర్యంలో, మూడుచింతలపల్లి మండలం నాగిశెట్టిపల్లిలో ఎంపీడీవో వత్సలాదేవి ఆధ్వర్యంలో దరఖాస్తులను స్వీకరించారు.



మేడ్చల్ మున్సిపాలిటీలో దరఖాస్తుల స్వీకరణను పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్



జగ్గంగూడలో ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి

| మున్సిపాలిటీ | వచ్చిన దరఖాస్తులు |
|---|---|
| మేడ్చల్ | 1205 |
| గుండ్లపోచంపల్లి | 831 |
| తూంకుంట | 1801 |
| నాగారం | 4875 |
| దమ్మాయిగూడ | 2279 |
| ఘట్‌కేసర్ | 1503 |
| పోచారం | 1633 |
| జవహర్‌నగర్ | 6255 |
| పీర్జాదిగూడ | 5000 |
| బోడుప్పల్ | 5000 |
| **మండలం** | **దరఖాస్తులు** |
| మేడ్చల్ | 2425 |
| శామీర్‌పేట | 1837 |
| మూడుచింతపల్లి | 1573 |
| ఘట్‌కేసర్ | 5679 |
| కీసర | 1885 |
| **మొత్తం** | **43,081** |



అంకిరెడ్డిపల్లి గ్రామసభలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అధికారులు

### ఘట్‌కేసర్, పోచారంలలో..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ఆరు గ్యారంటీల దరఖాస్తుల స్వీకరణ రెండో రోజు శుక్రవారం అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లోని అన్ని వార్డుల్లో సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులను తీసుకున్నారు. ఆయా మున్సిపాలిటీ కమిషనర్లు ఎండీ సాబేర్‌అలీ, వేమనరెడ్డి దరఖాస్తు స్వీకరణ కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.



పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో అభయహస్తం దరఖాస్తు ఫారాలను అధికారులకు అందజేస్తున్న మహిళలు



ప్రజలకు రశీదు అందజేస్తున్న మేయర్ బుచ్చిరెడ్డి, అధికారులు

## చివరి ఇంటి వరకు సీసీ రోడ్లు నిర్మిస్తాం..

**● ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావని**



ఘట్‌కేసర్ 7వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య యాదవ్

ఘట్‌కేసర్, డిసెంబర్ 29 : మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో చివరి ఇంటి వరకు సీసీ రోడ్లు నిర్మించేందుకు కృషి చేస్తున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య యాదవ్ తెలిపారు. 7వ వార్డులోమున్సిపాలిటీ సాధారణ నిధులు రూ. 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆమె శుక్రవారం కమిషనర్ ఎండీ సాబేర్ అలీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ నాగజ్యోతి నర్సింగ్‌రావు, బీఆర్ఎస్ నాయకుడు ముల్లి జంగయ్యయాదవ్ సిబ్బంది పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు

శామీర్‌పేట, డిసెంబర్ 29 : గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగద్గిరిగుట్ట(శామీర్‌పేట) ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు 2024–25 విద్యా సంవత్సరానికిగాను 5వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 18 నుంచి జనవరి 6 వరకు ఆన్‌లైన్‌లో రూ.100 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఫిబ్రవరి 11న అర్హత పరీక్ష జరుగుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మీ సేవా కేంద్రం తనిఖీ



కీసర మీ సేవా కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న తాసీల్దార్ అశోక్‌కుమార్

కీసర, డిసెంబర్ 29 : మీ సేవా కేంద్రాల నిర్వాహకులు ప్రజలకు అవసరమైన సేవలను అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే లైసెన్స్ రద్దు చేస్తామని కీసర తాసీల్దార్ అశోక్‌కుమార్ హెచ్చరించారు. కీసర మండలకేంద్రంలోని మీ సేవా కేంద్రాన్ని శుక్రవారం తాసీల్దార్ అశోక్‌కుమార్ సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించారు. ప్రజలను ఇబ్బంది పెట్టకుండా పనిచేయాలని నిర్వాహకులకు సూచించారు. దరఖాస్తులకు సంబంధించి ఎక్కువ డబ్బులు వసూలు చేస్తే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పోటీపడి చదువాలి

**● మోటివేషనల్ స్పీకర్, లయన్ గంపా నాగేశ్వర్‌రావు**

జవహర్‌నగర్, డిసెంబర్ 29: పోటీ ప్రపంచంలో విద్యార్థులు పోటీ పడి చదువాలని, నైపుణ్యాలను మెరుగుపర్చుకుంటేనే బంగారు భవిష్యత్ సొంతమవుతుందని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్, లయన్ గంపా నాగేశ్వర్‌రావు పిలుపునిచ్చారు. జవహర్‌నగర్ పరిధిలోని దమ్మాయిగూడ క్రాంతికీన్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సైనిక్, నవోదయ విద్యార్థులకు శుక్రవారం పోటీ పరీక్షల్లో మెళకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్ గంపా నాగేశ్వర్‌రావు హాజరై మాట్లాడారు. మనిషిలో దాగి ఉన్న గొప్ప మనసుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ఉపాధ్యాయులు చెప్పే విషయాలను విద్యార్థులు అర్థం చేసుకొనుకోవాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థులను ఉత్తేజపరిచే పలు అంశాలను వివరించారు. అనంతరం క్రాంతికీన్ ప్రెసిడెంట్, హైదరాబాద్ 320 హెచ్ లయన్స్‌క్లబ్ గవర్నర్‌గా నూతనంగా ఎన్నికైన ఎన్. మనోహర్‌రెడ్డిని అకాడమీ బృందం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో విశ్వేశ్వర్‌రావు, క్రాంతికీన్ డైరెక్టర్ లావణ్య,ప్రిన్సిపాల్ కల్యాణి, కౌన్సిలర్ అనూరాధ, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రాంతికీన్ అకాడమీలో విద్యార్థులకు పోటీపరీక్షలపై అవగాహన కల్పిస్తున్న గంపా నాగేశ్వర్‌రావు

